

ఆదిలాబాద్‌లో వార్డుల నుంచి కౌన్సిలర్లతో సభకు వస్తున్న ప్రజలు



సభలో నృత్యం చేస్తున్న కళాకారులు

# కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్

- ఎటుచూసినా గులాబీమయం
- సీఎం ప్రసంగానికి ప్రజలు ఫిదా

ఎదులాపురం/భీంపూర్, నవంబర్ 16 : ఎటుచూసినా గులాబీమయమే. సభాప్రాంగణం నిండిపోగా బయట కూడా సీఎం కేసీఆర్ సందేశం వినడానికి ఎండలో గంటల పాటు ప్రజలు నిరీక్షించారు. ఆదిలాబాద్‌లోని డైట్ మైదానంలో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించాల్సిన ప్రజా ఆశీర్వాద సభ రెండు గంటలు ఆలస్యమైనా పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చి ఎండలోనూ ఓపికగా నిరీక్షించారు. పట్టణంలోని వాడలు, నియోకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డప్పువాయిద్యాలతో వచ్చారు. సభలో వరంగల్‌కు చెందిన మిట్టు సురేందర్ బృందం పాటలు చైతన్యం కలిగించాయి . సీఎం కేసీఆర్ తెలుగు, హిందీ, ఉర్దూ, గోండి భాషలో మాట్లాడారు. సందిర్‌కున్ రాంరాం అని గోండి భాషలో సీఎం కేసీఆర్ అభివాదం చేయగా ఆదివాసీ జనం సంతోషంగా చప్పట్లు కొట్టారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సభలోకి నాలుగు ద్వారాల ద్వారా అన్ని తనిఖీలు చేసి మరి పంపారు.

**రామన్న .. బాగా అభివృద్ధి చేశారు..**

సీఎం కేసీఆర్ తన సందేశంలో ఎమ్మెల్యే జోగు రామన్న పని తీరును మెచ్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాను ఎమ్మెల్యేగా జోగు రామన్న ఎంతో అభివృద్ధి చేశారన్నారు. రామన్న చాలా ఉత్తమమైన వ్యక్తి అని, సామాన్యుడిలా ఉంటారని ఆయనపై నమ్మకంతోనే ఉదయమే ఆయన ఇంటివద్ద జనం జాతరలా ఉంటుందని అన్నారు. రామన్న తనతో పోట్లాడి జిల్లాకు వ్యవసాయ ,ఇంజినీరింగ్ కళాశాలలు తీసుకువచ్చారన్నారు. మరోసారి జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని అప్పుడు జిల్లా మరింత బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. సభ విజయవంతమైంది.



సీఎం కేసీఆర్‌కు చిత్రపటం అందజేస్తున్న మహిళా నాయకురాలు

**24 నిమిషాలు మాట్లాడిన సీఎం కేసీఆర్..**

ఎదులాపురం ,నవంబర్ 16 : సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.05 గంటలకు ఆదిలాబాద్ ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ల్యాండింగ్ అయ్యారు. హెలిప్యాడ్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వేణుగోపాలాచారిలకు ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న, ప్రముఖ హోమియోపతి వైద్యుడు, వైకుంఠట్రస్టు చైర్మన్ డాక్టర్ కాడిగిరి రవికిరణ్‌యాదవ్ స్వాగతం పలికారు. తర్వాత సభాస్థలికి 2.15కు చేరుకున్నారు. 2.21కి కేసీఆర్ ప్రసంగం ప్రారంభమైంది. 2.44 వరకు అంటే 26 నిమిషాలు ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రతి మాటకూ జనం స్పందిస్తూ కరతాళధ్వనులు చేశారు. తర్వాత సీఎం కేసీఆర్ ఇందిరాప్రియదర్శిని స్టేడియంకు రోడ్డుమార్గంలో ప్రత్యేక బస్సులో చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఇచ్చోడకు వెళ్లారు.

**సీఎం సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరిక**

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 16 : ఆదిలాబాద్‌లోని డైట్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కొండ గంగాధర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న నాయకులు



సభకు డప్పు చప్పుళ్లతో ర్యాలీగా వస్తున్న ప్రజలు

## అభిమానంతోనే సభకు వచ్చాను



నా పేరు షేక్ దస్తగిరి. భీంపూర్ మండలం ధనోరా గ్రామంలో మా కుటుంబానికి ఎనిమిది ఎకరాల వ్యవసాయం ఉన్నది. ప్రతి ఏడాదికి రూ. 80 వేల రైతుబంధు వస్తున్నది. ఇది పెట్టుబడికి సరిపోతున్నది. రైతుబంధు మొదలైనప్పటి నుంచి మా ఎవుసంకు వెలుగు వచ్చింది. రైతుబంధు, ఉచిత విద్యుత్, పంటలకు మంచి ధరలు.. ఇట్లా కేసీఆర్ సారు రైతులకు అంతా మంచిగా చేస్తున్నరు. నేను కూడా పిల్లగండ్లను మంచిగా చదివించిన. ఒక కుమారుడు ఇంజినీర్‌గా ఇడుపులపాయలో ఉన్నాడు. మా వ్యవసాయం బాగా లేకుంటే నేను పిల్లలను బాగా చదివించి ఉండేది కాదు. ఈ అభిమానంతోనే నేను మా గ్రామంనుంచి సీఎం సభకు హాజరయ్యాను. మళ్లీ తప్పకుండా బీఆర్ఎస్ సర్కారే వస్తది. మా గ్రామంలో సర్పంచ్ అజయ్ నుంచి అంతా గులాబీ పార్టీయే . **- షేక్ దస్తగిరి, రైతు, ధనోరా, భీంపూర్ మండలం**

## కేసీఆర్ సారే పెద్దన్నతీరు తోడు అయిండు



మాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. మా కొడుకులకు తలమడుగు మండలం రుయ్యాడిలో దళితబస్తీ భూమి ఇచ్చిండ్రు. ఇగ నాకు( బుచ్చన్న) నెలనెలా రూ. 2016 వృద్ధాప్య పింఛన్ వస్తున్నది. ఇట్ల మా పేద ఎస్సీ కుటుంబం బాగుపడడానికి సీఎం కేసీఆర్ సారే పెద్దన్నతీరు తోడు అయిండు. అందుకే ఆలుమగలము కలిసి సీఎం సారు మాటలు విందామని వచ్చాం. మళ్లీ సర్కారు వచ్చినంక పింఛన్ పెంచుతామని, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ ఇస్తమని కేసీఆర్ సారు చెప్పడం ఆనందమనిపించింది. మా బతుకులు ఇంకా మంచిగా అయితున్నందుకు సీఎం కేసీఆర్ సారే రావాలని కోరుకుంటున్నాం. **- బుచ్చన్నలక్ష్మి, హనుమాన్‌నగర్, ఆదిలాబాద్**

## పోడు పట్టాలిచ్చిండ్రు



మా గిరిజన గ్రామం నుంచి సీఎం కేసీఆర్ మాటలు వినడానికి చాలా మంది వచ్చాం . మా కుటుంబానికి తాతల నాటి భూమి 5 ఎకరాలు ఉన్నది. దానికి రైతుబంధు వస్తున్నది. ఇక అది మా ముగ్గురు కొడుకులు సాగు చేసుకుంటున్నరు. మా కోడళ్లకు కల్యాణలక్ష్మి డబ్బులు వాళ్ల తల్లి గారికి వచ్చాయి . కేసీఆర్ కిట్లు, నగదు కూడా తీసుకున్నాం. ఇక ఇంతట్లనే ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సారు మా కుటుంబానికి రెండున్నర ఎకరాల భూమికి పోడు పట్టాలు కూడా ఇచ్చిండ్రు. నేను, నా భర్త మాధవ్‌రావు ఈ పోడు భూమి సాగు చేస్తున్నాం . మా గ్రామంలో ఇలాంటి పథకాలతో అంతా ఆనందంగా ఉన్నారు. ఈ పథకాలకు తోడుగా రైతుబంధు, పింఛన్ల పెంపు , రూ.15 లక్షల దాకా ఆరోగ్యశ్రీ లాంటివి చేస్తమని కేసీఆర్ సారు చెబుతున్నారు. మా కుటుంబాల భవిష్యత్‌కు బీఆర్ఎస్ సర్కారే రావాలి. మేము కేసీఆర్ సారు రుణం మరిచిపోము . మేమంతా కేసీఆర్ సభకు వచ్చి తృప్తి చెందాం. **- కుమ్ర శకుంతల, గిరిజన మహిళా రైతు, రాజులగూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## దివ్యాంగుడిగా స్వచ్ఛందంగా ..



మా గ్రామం పొచ్చెర. కూలీనాలి చేసుకునే మాకు ఆరుగురు కూతుర్లు . ఇద్దరు కుమారులు . కుమారులు ఆటోలు నడుపుకుంటున్నరు. నాకు దివ్యాంగ పింఛన్ రూ 4,000 వస్తున్నది. ఇది మా బతుకుదేరుకు ఆసరా అవుతున్నది. సీఎం కేసీఆర్ సారు ఈ పింఛను మళ్లీ పెంచుతాం అన్నారు. ఇక మా కూతుర్ల ముగ్గురికి కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చాయి. కేసీఆర్ కిట్లు, నగదు కూడా సర్కారు ఇచ్చింది. పేదలకు అవసరమైన పథకాలు అన్ని ఇస్తున్న సీఎం కేసీఆర్ అంటే అందరితీరే మాకు ఎంతో అభిమానం . అదే అభిమానంతో నేను దివ్యాంగుడిని అయినా కూడా పొచ్చెర నుంచి ఆదిలాబాద్ సభకు ఆటోల వచ్చిన . సీఎం సారు మాటలు మాకు మరింత బలం ఇస్తున్నయి. ఈ సారి కూడా కారు గుర్తుకే ఓటు వేస్తాము . కేసీఆర్ సారే సీఎంగా ఉండాలని మేము దేవుళ్లను మొక్కుకుంటున్నాం. **- నల్ల దేవన్న, దివ్యాంగ పింఛన్‌దారు, పొచ్చెర, ఆదిలాబాద్ రూరల్ మండలం**

## మళ్లీ కేసీఆర్ సారే సీఎం



మాకు ముగ్గురు కొడుకులు. మేస్త్రీ పని చేసుకుంటున్నరు. ఇక సీఎం కేసీఆర్ దయతో నాకు నెలనెలా రూ.2016 పింఛన్ వస్తున్నది. దీంతోని ఇంట్లో నా మీద గౌరవం కూడా పెరిగింది. ఈ పైసలు మా కుటుంబానికి ఎంతో పనికి వస్తున్నయి . మనుమండ్లు, మనుమరాండ్లకు పనికి వస్తున్నయి. మా లాంటి గరీబు సరీబుకు ఎంతో చేస్తున్న కేసీఆర్ సారు మళ్లీ గెలువాలి. ఇయ్యాల నేను కేసీఆర్ సారును చూద్దామని, ఆయన మాటలు ఇందామనే కష్టమైనా ఇక్కడికి వచ్చిన . మేము కారు గుర్తుకే ఓటేసి ఎమ్మెల్యేగా జోగు రామన్ననే గెలిపించుకుంటాం. గీ సర్కారు ఉంటేనే పేదలు మంచిగా బతుకుతారు. మా వాడలో కూడా అంతా రామన్ననే గెలిపిద్దామంటున్నరు. **- మీరాబాయి, వృద్ధురాలు, హనుమాన్‌నగర్, ఆదిలాబాద్**

## ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



లేకర్‌వాడ నుంచి సీఎం కేసీఆర్ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

జైనథ్, నవంబర్ 16 : జైనథ్ మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు గురువారం ఆదిలాబాద్‌లోని డైట్ మైదానంలో నిర్వహించిన సీఎం ఆశీర్వాద సభకు తరలివెళ్లారు. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు గ్రామాల నుంచి బైక్, వాహనాల ద్వారా సభకు చేరుకున్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు పేర్కొన్నారు.